క్లుప్తంగా

వైభవంగా బూరుగులమ్మ తిరునాళ్ల

రేపల్లె: మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా రేపల్లె గ్రామదేవత బూరుగలమ్మ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు నందివెలుగు భానుసుధాకర్ గురుకులు ఆధ్వర్యంలో అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, అఖండ దీప స్థాపన, పంచామృత, ఫల రసాలతో అభిషేకం, సహస్ర కుంకుమార్చన, నీరాజన మంత్ర పుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి సద్ది నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

భట్టిప్రోలు: భట్టిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో శంకర నేత్ర చికిత్సాలయం (తెనాలి) ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి, ఉప సర్పంచ్ బుర్లె రామ ప్రసాద్ ప్రారంభించారు. శిబిరంలో 100 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా శుక్లాల ఆపరేషన్ చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 11న పేషంట్లను తెనాలి తీసుకువెళ్లి ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. శిబిరంలో ఆప్తమాలజిస్ట్ చైతన్య, పీఆర్వో వి.సోమరాజు, సిబ్బంది ఫిరోజ్, రెహమత్, యువాన్, వైఎస్సార్ సీపీ నాయకులు దారా చెన్నయ్య పాల్గొన్నారు.

వాచ్‌మెన్‌లను నియమించండి

అచ్చంపేట: మండలంలోని అచ్చంపేట, కోనూరు గ్రామాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వాచ్‌మెన్‌లు, అటెండర్స్‌తో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని జడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, జడ్పీ సీఈఓ జె.మోహనరావుని కోరారు. శనివారం జడ్పీ సమావేశం అనంతరం ఆయన సీఈవోని మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. మండలంలోని పలు సమస్యలను సీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. తాళ్లచెరువు గ్రామంలో నకిలీ పత్తి విత్తనాలు వేసి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారికి పరిహారం ఇప్పించేందుకు కృషిచేయాలని కోరారు. సీఈఓ సానుకూలంగా స్పందించి వెంటనే తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

బాపట్లటౌన్: రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం బాపట్లలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ దేవమ్మ వివరాల ప్రకారం.. 60 సంవత్సరాల వ్యక్తి బాపట్ల రైల్వేట్రాక్ దాడుతుండగా రైలు ఢీకొట్టింది. మృతుడి శరీరంపై తెల్లచొక్కా, నలుపు రంగు లుంగీ ఉన్నాయి. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

పేద విద్యార్థులకు 'విదేశీ విద్య' వరం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున



మోపర్రులో బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

మోపర్రు(వేమూరు): పేద విద్యార్థుల విదేశీ విద్య అకాంక్షలు నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన సాయం అందిస్తోందని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండలంలోని మోపర్రు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం జరిగింది. ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు అందుతున్న సంక్షేమ పథకాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విదేశీ విద్య అభ్యసిస్తున్న అన్ని వర్గాల పేద విద్యార్థులకు జగనన్న విదేశీ విద్య పథకం ద్వారా నగదు అందించడం జరిగిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రూ.15 లక్షలు, బీసీలు, కాపులు, ఇతర ఉన్నత కులాల విద్యార్థులకు రూ.10 లక్షలు ఇస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో విదేశీ విద్యకు కేటాయించిన నిధుల్లో పూర్తిగా అవకతవకలు జరగడంతో.. వాటిపై విచారణ చేసినట్లు గుర్తుచేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, గ్రామ సర్పంచ్ కొండపల్లి కిరణ్ బాబు, మోదుకూరి హరిబాబు, కొండపల్లి వినయ్, కొత్తమ పల్లి శేషయ్య, షేక్ వలీ, కాకర్లమూడి భాస్కర్, కాకిత సందీప్, కొండపల్లి వెంకట్, చక్రవరం గోవిందరాజు, గర్నిపూడి అజయ్, జి.రామకృష్ణ, మామిళ్లపల్లి బాలు, గోవతోటి ఏసోబు, మోదుకూరి ముత్యాలు, కొండపల్లి కొర్నియేలు, సోమిశెట్టి నాంచారయ్య, జాలాది కిష్టయ్య, చిక్కాల ఏసురత్నం, చల్లపల్లి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి చేయూతనివ్వాలి

రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత



సభలో మాట్లాడుతున్న హోంమంత్రి తానేటి వనిత

రేపల్లె రూరల్: ఆపదలో ఉన్నవారికి సాయం చేయడంతోనే ప్రభువు కృపకు పాత్రులవుతారని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. పట్టణంలోని ఐఆర్‌ఈఎఫ్ విద్యా సంస్థల ఆధ్వర్యాన గాస్పెల్ ఫీల్డు ఆవరణంలో శనివారం రాత్రి నిర్వహించిన సువార్త మహా సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. దేవుని దయతో నిస్వార్థ పాలనను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. దేవుని ఆశీస్సులతో రాష్ట్రంలోని పేదలు, దివ్యాంగులు, అనాథలను అన్నగా, తమ్ముడిగా.. మనువడిగా ఆయన ఆదరిస్తున్నారని చెప్పారు. క్రిస్టియానిటీ అంటే మతం కాదని మంచి మార్గమన్నారు. చీకటి నుంచి వెలుగులోకి.. చెడు నుంచి మంచి మార్గంలోకి వెళ్లేదే.. క్రిస్టియానిటి అని వివరించారు. మత మార్పిడి అని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఆ విధానానికి స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో దశమ భాగం సాయం చేయాలని కోరారు. పేదరికంలో ఉన్నవారికి, అనాథలకు చేసిన సాయం ఆ ప్రభువుకు చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌ఈఎఫ్ విద్యా సంస్థల అధినేత బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా, ప్రవాసాంధ్రులు దీవెన రెబ్బా, జాన్ రెబ్బా, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో హక్కులను కాపాడుకోవాలి

ఏపీ కృష్ణబలిజ సంఘం కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ భవానీ



సమావేశంలో ఐక్యత చాటుతున్న కృష్ణబలిజ సంఘం నాయకులు

రేపల్లె: ఐక్యతతో కృష్ణ బలిజ సంఘీయులు తమ హక్కులను కాపాడుకోవాలని ఏపీ కృష్ణ బలిజ, పూసల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కోలా భవానీ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం రాత్రి జరిగిన కృష్ణ బలిజ సంఘీయుల సదస్సులో ఆమె పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వం తమ సంఘీయులను అన్ని విధాలుగా ఆదుకుంటోందని అన్నారు. బీసీ ఉప కులాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. పట్టణంలో కమ్యూనిటీ హాలు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కోలా అశోక్‌కుమార్, సంఘ పట్టణ కమిటీ అధ్యక్షుడు కుప్పం అంకమ్మరావు, సంఘం డైరెక్టర్ అన్నం నరసింహారావు, నాయకులు కోలా సాంబశివరావు, బత్తుల శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

స్మశానవాటికలకు స్థలాల సేకరణ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ హరిబాబు, పక్కన ఎంపీడీఓ రాధాకృష్ణ

బాపట్ల అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో స్మశానవాటిక సమస్యలు లేకుండా చూడాలని గతంలో అధికారులను ఆదేశించారని, అయినా.. స్థలాల గుర్తింపులో జాప్యం జరుగుతోందని బాపట్ల ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు పేర్కొన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు ఈ సమస్యపై శ్రద్ధ చూపించాలని కోరారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులను సత్వరమే పూర్తి చేసి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ రాధాకృష్ణ మాట్లాడుతూ జనరల్ బాడీ సమావేశానికి అన్ని శాఖల మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. నవరత్నాలు పథకాలతో పాటు, రోడ్లు, భవనాలు, ఉపాధి హామీ పనులు, ఇతర సంక్షేమ పథకాలు అమలులో చిత్తశుద్ధి కనబరచాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఈఓపీఆర్డీ పులి శరత్‌బాబు, పరిపాలన అధికారి జేబీఎస్ రజిని, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాళ్లమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ



పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ఎంపీ మోపిదేవి

నగరం: గ్రామ దేవతలను భక్తిశ్రద్ధలతో పూజిస్తే గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. మండలంలోని ధూళిపూడి గ్రామం తాళ్లమ్మ అమ్మవారి ఆలయంలో తిరునాళ్ల సందర్భంగా ఆయన శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. ఎక్కడ దేవుడు పూజింపబడుతాడో ఆ ప్రాంతంలో సుఖ సంతోషాలు వెల్లివిరుస్తాయన్నారు. వేద పండితులు ఎంపీ మోపిదేవికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, సర్పంచ్ హేమామృతం, వైఎస్సార్ సీపీ నాయకులు విచారపు కుటుంబరావు, రాఘవేంద్ర, ఆనంద్, బాబురావు పాల్గొన్నారు.

కైతేపల్లిలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

రేపల్లె రూరల్: మండలంలోని కైతేపల్లి గ్రామంలో బండ్రెడ్డి పున్నారావు జ్ఞాపకార్థం బండ్రెడ్డి సాంబశివరావు సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను శనివారం ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు మండలి అంజయ్య, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చిమటా బాలాజీ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని నగరం మండలం ధూళిపూడినార్త్ తూర్పు బందెలవరపాలెంలో నిర్మిస్తున్న క్రీస్తు లూథరన్ చర్చి నిర్మాణానికి ఎంపీ మోపిదేవి రూ.1.5లక్షల విరాళం అందజేశారు. భవిష్యత్తులోనూ చర్చి అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, బందెలవరపాలెం గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఏఎన్‌యూ' క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించిన డి.రామోహన్‌రావు తదితరులు

బాపట్ల అర్బన్: బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో బాపట్ల ఇంజనీరింగ్ కాలేజ్, చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ అఫ్ ఫార్మసీ జట్లు తలపడ్డాయి. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల జట్టు.. నాలుగు వికెట్ల తేడాతో చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల జట్టుపై విజయం సాధించింది. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దొప్పలపూడి రామ్మోహనరావు, గెల్లి దిలీప్ కుమార్, సెక్రటరీ మానం నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ కొమ్మినేని హరి పద్మ ప్రసాద్, కోశాధికారి తాళ్లూరి రామకృష్ణరావు, సొసైటీ సభ్యుడు ఆవుల మధుసూదనారావు, ప్రిన్సిపల్ ఆచార్యులు షేక్ నజీర్, ఫిజికల్ డైరెక్టర్ అంకమ్మ చౌదరి పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు



మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్‌ఎం విజయ్‌కుమార్‌రెడ్డి

రేపల్లె: మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలకు రేపల్లె డిపో నుంచి ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోకు శనివారం సాధారణ తనిఖీలో ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 18, 19 తేదీలలో రేపల్లె ఆర్టీసీ డిపో నుంచి అరవపల్లి, గోవాడ, కోటప్పకొండ, శ్రీశైలం తదితర పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. గోవాడకు 20 సర్వీసులు, అరవపల్లికి 4 సర్వీసులు, కోటప్పకొండకు 20 సర్వీసులు, శ్రీశైలానికి 4 సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. ఆయా క్షేత్రాలకు వెళ్లే భక్తుల నుంచి కేవలం పాత ఛార్జీలే వసూలు చేస్తున్నామన్నారు. రేపల్లె నుంచి గోవాడకు రూ.45, రేపల్లె నుంచి అరవపల్లికి రూ.10 చార్జీలుగా నిర్ణయించినట్లు చెప్పారు. త్వరలో బాపట్ల నుంచి రేపల్లె వయా నిజాంపట్నం కొత్త ఆర్టీసీ సర్వీసును ప్రారంభించినట్లు చెప్పారు. సమావేశంలో డిపో మేనేజర్ డి.జాన్‌సుందరం పాల్గొన్నారు.

పాటలే ప్రజా ఉద్యమాలకు ఊతం

రేపల్లె: పాటలే ప్రజా ఉద్యమాలకు ఊతమని ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్ అన్నారు. దేశ స్వాతంత్ర్య, రైతాంగ సాయుధ పోరాటాల్లో ప్రజా నాట్యమండలి సేవలు ఎనలేనివని ఆయన కొనియాడారు. పట్టణంలోని మైనేని సీతా రామయ్య కల్యాణ మండపంలో శనివారం ప్రజా నాట్య మండలి రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు జరిగాయి. ఆసక్తి ఉన్న యువతకు ప్రజా నాట్యమండలి నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో 6 తేదీ వరకు మూడు రోజులు పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గాదె సుబ్బారెడ్డి, వి.నాగరాజు, బి.తులసీదాస్ పాల్గొన్నారు.



సంక్షిప్తం

కమనీయం..కల్యాణం

నిజాంపట్నం: మండలంలోని బాలాత్రిపుర సుందరి సహిత మల్లికార్జునస్వామి కల్యాణం కనుల పండువుగా సాగింది. అడవుల దీవి గ్రామంలో శనివారం జరిగిన మల్లికార్జునేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సవానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణం గావించారు. తిరునాళ్లకు పలు గ్రామాల నుంచి విద్యుత్ ప్రభలను తీసుకొచ్చి ఆలయం చుట్టూ తిప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు పడకుండా రేపల్లె రూరల్ సీఐ శివ శంకర్ ఆధ్వర్యంలో అడవుల దీవి ఎస్ఐ రవి తన సిబ్బందితో పటిష్ట బందోబస్తు చేశారు.

నేటికీ భూమి కోసం పోరాటాలా..?

భట్టిప్రోలు: నేటికీ దళితులు భూమి కోసం పోరాటాలు చేయాల అని మాదిగ దండోరా రాష్ట్ర నాయకులు యలమాటి దాసు పేర్కొన్నారు. భట్టిప్రోలు బౌద్ధ స్థూపం వద్ద శనివారం ఆలిండియా షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర కార్యదర్శి యన్నం సురేష్ మాట్లాడుతూ.. చింతల్లంకలో దళితులపై అగ్రవర్ణాలు దాడి చేయడం దారుణమన్నారు. ఛలో చింతల్లంక తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జై భీమ్ పార్టీ నాయకుడు దోవా రమేష్ రాంజీ, వివిధ సంఘాల నాయకులు కె.మాణిక్యరావు, వి.గురవయ్య, ఎం.వాసుదేవ్ గౌడ్, పి.నాగేశ్వరరావు, ఎ. ఇస్సాకు, కె.నాని, కె.సురేష్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పం శిక్షణ ఏర్పాట్ల పరిశీలన

కర్లపాలెం: జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంపై గ్రామ సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రలు, ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తున్న షెడ్డు నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో ఎలీషాబాబు అన్నారు. దమ్మనవారిపాలెంలో సంపద సృష్టి కేంద్రం వద్ద నిర్మిస్తున్న షెడ్డును శనివారం ఎంపీడీవో పరిశీలించారు. ఈ నెల 10న మొదటి విడత శిక్షణ కేంద్రం ప్రారంభమవుతుందని తెలిపారు. సర్పంచ్ గురపసాల వెంకటేశ్వరమ్మ, గురపసాల జగ్గయ్య, కార్యదర్శి సునీత సచివాలయం సిబ్బంది ఉన్నారు.

షార్ట్ టెండర్ల ఆహ్వానం

అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరు మండలం గోవాడలో కొలువైన బాలకోటేశ్వరస్వామి దేవాలయానికి పెయింటింగ్ వేయుటకు ఈ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారా షార్ట్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ అశోక్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వారంలోగా టెండర్లను అందించాలని పేర్కొన్నారు. వివరాలకు దేవాలయం కార్యాలయంలో సంప్రదించాలని వెల్లడించారు.

గృహ నిర్మాణాలు పరుగులు పెట్టాలి

వేమూరు: లబ్ధిదారులతో మాట్లాడి జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రసాద్ సూచించారు. వేమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, డ్వాక్రా గ్రూపుల సీసీలతో ఆయన సమావేశం నిర్వహించారు. అధికారులు సక్రమంగా పని చేయకపోవడంతో మండలంలోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వెనుకబడినట్లు తెలిపారు. నిర్మాణాలు వేగవంతం చేయకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. బాపట్ల జిల్లా డీఆర్‌డీఏ పీడీ బొంత అర్జునరావు, ఇన్‌చార్జీ ఎంపీడీఓ సునీత తదితరులు పాల్గొన్నారు.

శివ నామస్మరణతో మారుమ్రోగిన అగ్రహారం

కర్లపాలెం: కర్లపాలెంలోని అగ్రహారం శనివారం శివ నామస్మరణతో మారుమ్రోగింది. స్థానిక గంగా, గౌరీ సమేత బదరీ కేదారేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ యాజలి గ్రామ కమిటీ అధ్యక్షుడు పేరాల వెంకట సురేష్ దంపతుల ఆధ్వర్యంలో స్వామివారి చిత్ర పటాలకు విశేష పూజలు నిర్వహించారు. శివ మాలధారులు ఆలయానికి చేరుకుని ప్రదక్షణలు చేశారు. స్వామివారిని దర్శించుకుని, ఆలయ ప్రాంగణంలో స్వామివారి చిత్ర పటాలకు పూజలు చేశారు. భక్తి గీతాలతో భజనలు నిర్వహించారు. మాలధారులకు తీర్థ ప్రసాదాలు, చద్ది పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, మందపాటి పరమానందకుమార్ పాల్గొన్నారు.

'జేమ్స్ ఆడమ్స్'తో ఐలవరం విద్యార్థులు..

భట్టిప్రోలు: అమెరికాలోని నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ సంస్థలో డిప్యూటీ చీఫ్ టెక్నాలజిస్టుగా మూడున్నర దశాబ్దాలు పని చేసి ఇటీవల రిటైర్డ్ అయిన జేమ్స్ ఆడమ్స్‌ను సోమవారం ఐలవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇంట్రాక్ట్ కానున్నారు. జేమ్స్ ఆడమ్స్‌కు ప్రపంచ వ్యాప్తంగా గొప్ప టెక్నాలజిస్టుగా మంచి పేరుంది. పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు పచ్చారు హరికృష్ణ హెన్రీ ట్రూప్ అనే శాస్త్రవేత్త ద్వారా జేమ్స్‌ని ఆన్‌లైన్ ద్వారా కలసి.. తమ రాష్ట్రంలోని విద్యార్థులతో ఇంట్రాక్ట్ అయ్యేందుకు విజ్ఞప్తి చేశారు. అందుకు ఆయన అంగీకరించారు. విద్యార్థుల ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇవ్వనున్నట్లు హరికృష్ణ గురువారం విలేకరులకు తెలిపారు. 97013 58838 నంబరుకు సంప్రదించాలని తెలిపారు.

గృహ నిర్మాణానికి భూమి పూజ

కోనేటిపురం(భట్టిప్రోలు): హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని కోనేటిపురం గ్రామం జగనన్న కాలనీలో లబ్ధిదారు యేమినేని విజయశ్రీ ప్లాటులో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి శనివారం భూమి పూజ చేశారు. డ్వాక్రా సిబ్బంది సహాయంతో ఇద్దరి లబ్ధిదారుల నుంచి రూ.70 వేలు నగదు ఇంజినీరింగ్ అసిస్టెంట్ విజయసారథికి అందజేశారు. కాలనీలో ఇప్పటికే పూర్తయిన బెల్లంకొండ లలిత గృహాన్ని సందర్శించి, సంతోషం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, సర్పంచ్ మోర్ల వెంకటేశ్వరమ్మ, పార్టీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), ఏపీఎం కొండూరి శోభన్, కార్యదర్శి టి.అనూరాధ, ఎ.చిన వెంకటేష్‌బాబు, ఎన్ఆర్ ఈజీఎస్ జేఈ జయ చంద్రకుమార్ పాల్గొన్నారు.

సక్రమంగా తాగునీరు సరఫరా చేయాలి

రేపల్లె: పట్టణంలో సక్రమంగా తాగునీటిని మున్సిపల్ అధికారులు సరఫరా చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు అన్నం సాయిప్రసాద్ పేర్కొన్నారు. తాగునీటి సమస్యపై మున్సిపల్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. రెండు పూటలా ఇచ్చే తాగునీరు.. ప్రస్తుతం ఒక పూట మాత్రమే అందిస్తున్నారని తెలిపారు. రోజులో కనీసం 45 నిమిషాలు సరఫరా చేస్తే.. తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని సూచించారు. ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాయకులు వాకా శివరాం, పిన్ని సాంబశివరావు, శ్రీను, సీతా రామాంజనేయులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన

రేపల్లె రూరల్: క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని నల్లూరు వృద్ధాశ్రమంలో శనివారం క్యాన్సర్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ వీరేశలింగం క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఎంసీఏ మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ వి.ప్రకాశరావు, వి.సాంబ శివరావు, చక్రపాణి, లోకేశ్వరరావు, లక్ష్మీనారాయణ, చక్రవర్తి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు సేవిస్తే జీవితం అంధకారం

బాపట్లటౌన్: మాదక ద్రవ్యాలు సేవిస్తే జీవితం అంధకారంగా మారుతుందని సెబ్ ఏఈఎస్ జి.నరశింహరావు తెలిపారు. శనివారం ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఫార్మసీ కళాశాలలోని విద్యార్థులకు మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సెబ్ సీఐ ఎస్. శ్రీనివాసరావు, పట్టణ ఎస్ఐ రఫీ, బాపట్ల ప్రభుత్వ హాస్పిటల్ వైద్యులు రసూల్ పాల్గొన్నారు.